క్లుప్తంగా

నేడు పెందుర్తిలో జగనన్నకు చెబుదాం

మహారాణిపేట: పెందుర్తిలో బుధవారం జగనన్నకు చెబుదాం మండల స్థాయి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. పెందుర్తి లోని జిల్లా మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజలు ఫిర్యాదులు,దరఖాస్తులను నేరుగా అందజేయవచ్చన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

వైభవంగా నిత్య కల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలోనివేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకాలు



విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెం లోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో వేంజేసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కష్ణశర్మ పూజలను నిర్వహించారు.

భారీ అన్న సమారాధన

సింహాచలం: నాయుడుతోట దరి పద్మనాభనగర్‌లో కొలువైన శ్రీ ఆదిశక్తి నాగ మానసా దేవి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. భక్తులకు విశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భవానీ దీక్షాదారులకు, భక్తులకు పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు.

అధ్యాపకులపై గురుతర బాధ్యత

ఏయూ క్యాంపస్: పటిష్టమైన బోధన వ్యవస్థతో మెరుగైన సమాజం నిర్మాణం సాధ్యపడుతుందని ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు అన్నారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం దూరవిద్య బీఈడీ విద్యార్థుల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఉపాధ్యాయులు దేశ ప్రగతికి మార్గదర్శకులుగా నిలుస్తున్నారన్నారు. జాతీయ నూతన విద్యా విధానం లక్ష్యాలను చేరుకునే దిశగా కృషి చేయాలని సూచించారు. ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ టి.శోభశ్రీ మాట్లాడుతూ భవిష్యత్ తరాన్ని తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు.

విండ్‌బాల్ క్రికెట్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక: గాజువాక హైస్కూల్ రోడ్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్వహించనున్న జిల్లా స్థాయి విండ్‌బాల్ క్రికెట్ పోటీల పోస్టర్‌ను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ హైస్కూల్ మైదానంలో నిర్వహించనున్న ఈ పోటీల్లో 25 జట్లు పాల్గొననున్నాయన్నారు. ఈ పోటీల్లో మొదటి స్థానం సాధించిన జట్టుకు రూ.10వేలు, రెండో స్థానానికి రూ.6వేల నగదుతో పాటు ట్రోఫీలను అందజేస్తారన్నారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ సాధించిన వారికి ప్రత్యేక బహుమతులు ఉంటాయని తెలియజేశా రు.కార్యక్రమంలో నిర్వహణ కమిటీ చైర్మన్ గూటూరు శంకరరావు,ప్రతినిధులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



ప్రజలకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: అర్హతే ప్రామాణికంగా.. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. రావాడ శివారు రేఖవానిపాలెం గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రేఖవానిపాలెం, రేఖవానిపాలెం కాలనీ, గొల్లగుంట, గొల్లగరువు, ఎన్టీఆర్ కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతీ ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల చెప్పిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రావాడ గ్రామంలో పేద ప్రజలకు ఇప్పటి వరకు ప్రభుత్వం రూ.31.34 కోట్ల సంక్షేమ పథకాలు అందించిందన్నారు. ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన సీఎం జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవడానికి ప్రజలంతా ముందుకు రావాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, మాజీ ఆర్ఈసీఎస్ చైర్మన్ చల్లా కనకారావు, వైఎస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల మాజీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు, నాయకులు అశోక్, పల్లా గోవిందు, కావలి వాసు, కావలి అప్పలరాజు, గంగరాజు, ఈవోఆర్డీ రమేష్‌నాయుడు, ఏఈలు జి.రామారావు, శేషసాయి, ఎం.ఎస్.ఎన్.రెడ్డి, ఏపీఎం కనకమ్మ, ఏవో సీహెచ్.చంద్రావతి, వీఆర్వో భుజంగరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు....

గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ బుధవారం ఉదయం రావాడ శివారు బొట్టవానిపాలెం, మోటూరువానిపాలెం, ఇందిరమ్మ కాలనీలో.. సాయంత్రం జల్లెలపాలెం, శృంగారపాడు, ధర్మారాయుడుపేట కూడలి ప్రాంతాల్లో పర్యటిస్తారని మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు కోరారు. పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

సామాజిక తనిఖీలతో పారదర్శకత



మాట్లాడుతున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

సబ్బవరం: సామాజిక తనిఖీలు చేయడం వల్ల పనుల్లో అవకతవకలకు చెక్ పడడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పెరుగుతాయని ఎంపీపీ బోకం సూర్యకుమారి చెప్పారు. స్థానిక మండల పరిషత్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన 16వ విడత మండల స్థాయి సామాజిక తనిఖీల ప్రజా వేదికలో ఆమె ప్రసంగించారు. ఉపాధి హామీ పథకంలో సిబ్బందితో పాటు అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పనులు గుర్తించడం వల్ల మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు.

1196 పనులపై సామాజిక తనిఖీ

ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని 24 పంచాయతీల్లో చేపట్టిన 1,196 పనులను సామాజిక తనిఖీల్లో పరిశీలించినట్టు చెప్పారు. ఈ పనులకు రూ.10.24 కోట్లు వెచ్చించగా వీటిలో ఉపాధి కూలీలకు వేతనాల రూపంలో రూ.8.29 కోట్లు, మెటీరియల్ రూపంలో రూ.1.94 కోట్లు చెల్లింపులు జరిగాయన్నారు. పలు గ్రామాల్లో చేపట్టిన పనుల్లో రూ.18 వేలు వరకూ లోపాలు,లోటుపాట్లు జరిగినట్లు సామాజిక తనిఖీల సిబ్బంది గుర్తించి సభ దృష్టికి తీసుకువచ్చారు. వారం రోజుల్లో సిబ్బంది నుంచి రికవరీ చేయాలని విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో పి. శ్రీరాంమూర్తి, జిల్లా అడిషనల్ పీడీ రోజా రమణి, ఎస్ఆర్ఈజీఎస్ ప్రోగ్రాం అధికారి రమేష్ నాయుడు, క్లస్టర్ ఏపీడీ మణికుమార్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, నాయకుడు బోకం రామునాయుడు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ మెరుగైన వైద్యం

ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం: ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. సబ్బవరం సచివాలయం –4 పరిధిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. వైద్యంతో పాటు అవసరమైన మందులు ఉచితంగా అందిచండం జరుగుతుందన్నారు. వైద్య శిబిరంలో 452 మంది పరీక్షలు చేయించుకున్నారు. అలాగే కంటి వైద్య శిబిరంలో 182 మంది పరీక్షలు చేయించుకున్నారు వారి లో అవసరమైన 126 మందికి కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు,సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఎంపీడీవో రమేష్ నాయుడు, మాజీ ఎంపీపీ గొర్లి ఉమామహేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు బంతికోళ్ల పద్మ, గొర్లి అచ్చెంనాయుడు పాల్గొన్నారు. డాక్టర్ శ్రీనివాసరావు,డాక్టర్ ఆశ,డాక్టర్ రాజీవ్‌తో పాటు వైద్య సిబ్బంది సేవలందించారు.

శారదాపీఠాన్ని సందర్శించిన సీపీ రవిశంకర్



స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులు తీసుకుంటున్న సీపీ రవిశంకర్

సింహాచలం: చినముషిడివాడలోని విశాఖ శ్రీ శారదాపీఠాన్ని మంగళవారం నగర సీపీ రవిశంకర్ సందర్శించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాజశ్యామల అమ్మవారిని దర్శించుకున్నారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతిలను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. కమిషనర్‌తో పాటు డీసీపీలు శ్రీనివాసరావు, ఆనందరెడ్డి, నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి స్వామీజీలను కలిశారు.

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు



అన్నపూర్ణాదేవిగా ఉమాదేవి



వైష్ణవీదేవిగా రాజశ్యామల అమ్మవారు



శారదాపీఠంలో నిర్వహించిన కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

సింహాచలం: శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మూడో రోజు మంగళవారం అమ్మవారు పలు అలంకరణల్లో పూజలు అందుకున్నారు. అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఉమాదేవి అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారి మూలవిరాట్‌ను పలు రకాల కూరగాయలతో అలంకరించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

- చినముషిడివాడలోని విశాఖ శ్రీ శారదాపీఠంలో శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు వైష్ణవీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. రాజశ్యామలా సమేత చంద్రమౌళీశ్వరులకు దేవతార్చన చేశారు. శమీ వృక్షం చుట్టూ ప్రదక్షిణ చేశారు. శ్రీచక్రానికి ఏడుగంటలపాటు నిర్విరామంగా నవావరణ అర్చన నిర్వహించారు. సాయంత్రం జరిగిన సామూహిక కుంకుమార్చనల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్యం



మీడియాతో మాట్లాడుతున్న మహాత్మాగాంధీ క్యాన్సర్ రీసెర్చ్ హాస్పటల్ అధినేత మురళీకృష్ణ

సీతమ్మధార : అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రొమ్ము క్యాన్సర్‌ను నయం చేయవచ్చని మహాత్మాగాంధీ క్యాన్సర్ రీసెర్చ్ హాస్పటల్ అధినేత డాక్టర్ వూన మురళీకృష్ణ అన్నారు. మంగళవారం ఆశీలమెట్టలోని ఓ హోటల్‌లో మీడియాతో మాట్లాడారు. దేశంలోని అన్ని ప్రీమి యర్ ఇన్‌స్టిట్యూట్‌లలో నిపుణులైన అంకాలజిస్టులు అందుబాటులో ఉన్నారన్నారు. 18 ఏళ్లుగా 8,500 మంది రొమ్ము క్యాన్సర్ బాధితులకు విజయవంతంగా చికిత్సలు చేసినట్టు తెలిపారు. రొమ్ము క్యాన్సర్ ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన ఆరోగ్య సమస్యగా మారిందన్నారు. రొమ్ము క్యాన్సర్‌ను ముందుగా గుర్తించి చికిత్స అందిస్తే నయం అవుతుందన్నారు. మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రా ల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైద్యసేవలందిస్తోందన్నారు.

చిన్నారుల సమగ్ర వికాసమే లక్ష్యంగా..

ఒక భవనం పటిష్టంగా నిర్మించాలంటే పునాది ఎంత ముఖ్యమో, చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రాథమిక స్థాయిలో నేర్చుకునే విజ్ఞానము అంతే విలువైనది. బాల్యంలో ప్రాథమిక అంశాలపై పట్టు సాధించిన విద్యార్థులు, తర్వాత తరగతుల్లో సంక్లిష్టమైన, కొత్త విషయాలను కూడా సులభంగా నేర్చుకోగలరు. అందుకు అనుగుణంగా చిన్నారుల సమగ్ర వికాసంపై దృష్టి సారించింది రాష్ట్రప్రభుత్వం. ప్రాథమిక విద్యతో పాటు పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి పటిష్టమైన చర్యలు చేపట్టింది. అందులో భాగంగా చిన్నారుల అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరిచేలా ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

- ప్రాథమిక, పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి చర్యలు
- మెరుగైన అభ్యసనానికి 'ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ'
- 'ప్రథమ్' భాగస్వామ్యంతో మూడు జిల్లాల్లో 126 మందికి శిక్షణ



గ్రూప్ యాక్టివిటీలో భాగంగా కాగితంతో కళాకృతులు చేసి అలరించేలా..



విద్యార్థులు సులభరీతిలో గ్రహించేందుకు చిత్రాల రూపంలో శిక్షణ ఇచ్చేలా..



విద్యార్థులకు వినోదం పంచేలా..

అక్కిరెడ్డిపాలెం: విద్యారంగంపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్న రాష్ట్రప్రభుత్వం ప్రాథమిక విద్య బలోపేతానికి కృషి చేస్తోంది. పాఠశాల విద్యలో విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రాథమిక, పూర్వ ప్రాథమిక విద్యను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చింది. పునాది నుంచి విద్యార్థుల అభ్యసనాన్ని బలోపేతం చేసేలా ప్రణాళిక రూపొందించింది. అందులో భాగంగా పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో విద్యార్థి అభ్యసనా సామర్థ్యల పెంపుదలకు ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని చేపట్టింది. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ప్రాజెక్టులో భాగంగా ఎస్‌జీఓ సంస్థ ప్రథమ్ భాగస్వామ్యంతో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పూర్వ ప్రాథమిక, ప్రాథమిక పాఠశాలల్లో అమలు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది.

ఈసీఈసీలో భాగంగా..

నూతన విద్యావిధానం 2020లో భాగంగా ప్రభుత్వం పలు విద్యా సంస్కరణలను తీసుకువచ్చింది. నిపుణ్ భారత్ లక్ష్యాలను సాధించే క్రమంలో భాగంగా ఎర్లీ చైల్డ్‌హుడ్ సెంటర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ)ను ప్రవేశపెట్టింది. ఇందులో ప్రీ ప్రైమరీ -1, ప్రీ ప్రైమరీ - 2ను అమలు చేస్తోంది. ప్రీ ప్రైమరీ - 1లో 3, 4 ఏళ్ల చిన్నారులకు, ప్రీ ప్రైమరీ– 2లో 4, 5 ఏళ్ల చిన్నారులకు ఆటపాటలతో కూడిన బోధన అందిస్తారు. ప్రీ ప్రైమరీలోనే పాఠశాల సంసిద్ధత కార్యక్రమాలను అమలు చేస్తారు. ఐదేళ్లు నిండిన చిన్నారులకు ప్రైమరీ తరగతులు నిర్వహిస్తారు. ప్రీ ప్రైమరీ, ప్రైమరీలలో 1, 2 తరగతులకు ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ కార్యక్రమాలను అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా 2026 -27 విద్యా సంవత్సరానికి రెండో తరగతి నుంచి మూడో తరగతికి వెళ్లే విద్యార్థులందరూ ఆయా తరగతుల అభ్యసనా సామర్థ్యలను కచ్చితంగా పొందాల్సి ఉంటుంది.

అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించేందుకు..

10వ తరగతికి చేరుకుంటున్న విద్యార్థుల్లో తెలుగు, గణితంలో ప్రాథమిక భావనలు ఉండటం లేదన్న కఠోర వాస్తవాలను ఎన్నో నివేదికలు బహిర్గతం చేస్తున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించేలా ప్రభుత్వం పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యలను మెరుగు పరిచేందుకు అవసరమైన చర్యలు చేపడుతోంది అందులో భాగంగానే ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ కార్యక్రమం చేపట్టింది. ప్రతీ విద్యార్థి పూర్వ ప్రాథమిక, ప్రాథమిక విద్య (1, 2 తరగతులు) పూర్తి చేసి 3వ తరగతిలో చేరే సమయానికి తెలుగులో చదవటం, రాయడం, వినడం మాట్లాడటం రావల్సి ఉంటుంది. గణితంలో చతుర్విధ ప్రక్రియలైన కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగహారాల్లో పట్టు సాధించాలి.

జ్ఞాన జ్యోతి..జ్ఞాన ప్రకాష్

ఎఫ్ఎల్ఎన్ అమల్లో భాగంగా పూర్వ ప్రాథమిక విద్యను జ్ఞాన జ్యోతిగా.. ప్రాథమిక విద్యను జ్ఞాన ప్రకాష్‌గా పేర్కొన్నారు. ముందుగా ప్రాథమిక విద్యను బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు డీఆర్పీల శిక్షణను పూర్తి చేశారు. మండలానికి ముగ్గురు ఎస్‌జీటీలను డీఆర్పీలుగా ఎంపిక చేసి, వారికి రెసిడెన్షియల్ మోడ్‌లో శిక్షణ ఇచ్చారు. ప్రతీ జిల్లాలో అన్ని మండలాల నుంచి డీఆర్పీలు శిక్షణ పొందారు. ఎఫ్ఎల్ఎన్ 60 రోజుల జ్ఞాన ప్రకాష్ శిక్షణలో భాగంగా విశాఖపట్నం జిల్లా నుంచి 27 మంది డీఆర్పీలు శిక్షణ పూర్తి చేసుకున్నారు. త్వరలోనే డీఆర్పీలు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం జ్ఞాన జ్యోతిలో భాగంగా డీఆర్పీలుగా ఎంపిక చేసిన వారికి కూడా 6 రోజులు రెసిడెన్షియల్ ట్రైనింగ్‌ను అందిస్తున్నారు. మొదటి స్పెల్‌లో భాగంగా ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు షీలానగర్‌లోని మిలీనియం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో విశాఖపట్నం జిల్లాతో పాటు అనకాపల్లి, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు చెందిన 126 మందికి శిక్షణ ఇచ్చారు. మహిళా శిశు సంక్షేమ శాఖకు చెందిన సూపర్‌వైజర్లు, పీవోలు 54 మంది, మూడు జిల్లాలకు చెందిన ఎస్జీటీలు 72 మంది ఆరు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ పొందారు.

ఎఫ్ఎల్ఎన్ మంచి కార్యక్రమం



ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా ఇప్పటికే 60 రోజుల శిక్షణలో భాగంగా జిల్లాలో డీఆర్పీలు శిక్షణ పొందారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే డీఆర్పీలు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. రెండో దశ 120 రోజుల పూర్వ ప్రాథమిక, ప్రాథమిక విద్యను బోధించే అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఎస్జీటీలకు శిక్షణ ఇచ్చే జీఆర్పీలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఎఫ్ఎల్ఎన్ చాలా మంచి కార్యక్రమం.

–ఎల్.చంద్రకళ, డీఈవో

ప్రతీ చిన్నారి సర్వతోముఖాభివృద్ధికి కృషి



ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమంతో ప్రతీ చిన్నారి సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుంది. జ్ఞాన జ్యోతి పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ, పాఠశాల విద్యా శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. రెండు శాఖలు సంయుక్తంగా ఒకే వేదికపై శిక్షణ ఇవ్వడం ఇదే తొలిసారి, చక్కటి వాతావరణంలో ఈ కార్యక్రమం విజయవంతం కావడం సంతోషదాయకం.

–పి.వెంకటరమణ, ఎస్ఎస్ఏ రాష్ట్ర పరిశీలకుడు

జీవీఎంసీ ఉద్యోగులకు కమిషనర్ అభినందన



ఉద్యోగులను అభినందిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ


డాబాగార్డెన్స్ : జీవీఎంసీ ఉద్యోగులకు ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్‌లో స్థానం దక్కింది. అసోసియేషన్‌లో జీవీఎంసీ సూపరింటెండెంట్ అక్కరబోయిన అప్పలరాజు జనరల్ సెక్రటరీగా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మువ్వల రవి కోశాధికారిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ అసోసియేషన్‌లో స్థానం దక్కించుకున్న జీవీఎంసీ ఉద్యోగులను అభినందించారు. జీవీఎంసీ జెమ్స్ భవనంలో మంగళవారం సాయంత్రం మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అధ్యక్షుడు అప్పలనాయుడు నేతృత్వంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వామనరావు ఆధ్వర్యంలో పదవులు పొందిన వారంతా కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఇద్దరి అదృశ్యం

మర్రిపాలెం : కంచరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన వెలుగు చూసింది. పోలీసుల వివరాల ప్రకారం కుప్పిలి మీనాక్షి దివ్య (18) ఓ ప్రైవేట్ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. పట్టాభిరెడ్డి తోట ప్రాంతంలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తోంది. తండ్రి కారు డ్రైవర్‌గా పని చేస్తారు. రోజూ మాదిరిగానే మంగళవారం కాలేజీకి వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో అంతటా వెదికినా ఫలితం లేక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్. సాయి నేతృత్వంలో ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణకుమారి కేసు దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి అదృశ్యం.. : కంచరపాలెం పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. ఫిఫ్త్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జ్ఞానాపురంలో భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి నిసిస్తున్న ఆకుల జయేంద్ర కేజీహెచ్‌లో వార్డు బాయ్‌గా పని చేస్తారు. అయితే ఆర్థిక ఇబ్బందులున్నాయని చెప్పి ఇంట్లో నుంచి గత నెల 10న వెళ్లిపోయారు. ఇన్ని రోజులు కనీసం ఆచూకీ లేకపోవడంతో అతని భార్య ఆకుల అనురాధ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్. సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ మూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు.

27న ఓటరు జాబితా ముసాయిదా



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో లక్ష్మారెడ్డి

గాజువాక: నియోజకవర్గంలో ఓటరు జాబితా ముసాయిదాను ఈ నెల 27న ప్రచురించనున్నట్లు గాజువాక ఓటర్ల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే నియోజకవర్గంలో నిర్వహించిన ఇంటింటి సర్వే సందర్భంగా గుర్తించిన ఆబ్సెంట్, శాశ్వతంగా వలస వెళ్లిన 11,196 మంది ఓటర్లకు నోటీస్–బీలను జారీ చేసినట్టు తెలిపారు. ఈ నోటీసులను స్పీడ్ పోస్ట్ ద్వారా ఓటర్లకు పంపించామని, వాటిని కూడా పరిగణనలోకి తీసుకొని ముసాయిదా జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రతిపాదనలను ఎన్నికల సంఘం ఆమోదించిన వెంటనే ఆ జాబితాలను రాజకీయ పార్టీలకు అందజేస్తామన్నా రు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పి.సింహాచలం, గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి, పెదగంట్యాడ తహసీల్దార్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అర్ధంతరంగా ముగిసిన బోనస్ సమావేశం

ఉక్కునగరం: సెయిల్ కార్మికుల బోనస్ సమావేశం అర్ధంతరంగా ముగిసింది. ఈ ఏడాది సెయిల్ కార్మికులకు బోనస్ చెల్లింపులపై మంగళవారం న్యూఢిల్లీలో ఎన్‌జేసీఎస్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈ ఏడాది నుంచి అమలులోకి రానున్న కొత్త ఫార్ములా ప్రకారం రూ. 22,579 ఇస్తామని సెయిల్ యాజమాన్యం ప్రతిపాదించింది. కార్మిక సంఘాలు గతేడాదిలా రూ. 40,500 ఇవ్వాలని డిమాండ్ చేశాయి. దానికి యాజమాన్యం నుంచి స్పందన రాకపోవడంతో కార్మిక సంఘాల నాయకులు వాకౌట్ చేశాయి.

ఉక్కు కర్మాగార పరిరక్షణే ధ్యేయం



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: వేలమంది కార్మికులకు జీవనోపాధి కల్పిస్తూ, దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సాయపడుతున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడమే ధ్యేయంగా కార్మికులు పోరాటం చేస్తున్నారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. దీనికి కేంద్రం సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 978వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను సమైక్యంగా ఎదుర్కొనేందుకు కార్మికవర్గాన్ని సమాయత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.